జోరుగా ధాన్యం కొనుగోళ్లు

సోమేశ్వర్ గ్రామ శివారులో కొనసాగుతున్న వరిధాన్యం కొనుగోళ్లు

ధాన్యాన్ని కుప్పలు చేస్తున్న రైతులు

- మబ్బులు పట్టిన వాతావరణం
- అయోమయంలో రైతులు

బాన్సువాడ, ఏప్రిల్ 12 : బాన్సువాడ డివిజన్ కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు పండించిన పంటలు చేతికి రావడంతో కొనుగోళ్లు జోరందుకున్నాయి. ఆయా కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. మరికొన్ని చోట్ల నాలుగైదు రోజులుగా వాతావరణం మబ్బులుపట్టి ఉండడం, అక్కడక్కడా ఉరుములు మెరుపులతో కూడిన వడగండ్ల వర్షాలు కురువడంతో పంటను కోసేందుకు రైతులు అయోమయానికి గురవుతున్నారు. పంటను కోస్తే ధాన్యం తడిపిపోతుందని కొంతమంది రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల క్రితం వరి కోతలు చేపట్టిన రైతుల ధాన్యాన్ని ఆరబోసే పనిలో నిమగ్నమయ్యారు. ఎండిన ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా కర్ణాటక, మిర్యాలగూడ, హైదరాబాద్ లాంటి పట్టణాలకు చెందిన వ్యాపారులకు రూ.2,200 ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. పట్టణంలో పలు రైస్‌మిల్లులకు ధాన్యాన్ని తీసుకెళ్తే పట్టడం లేదని, కొర్రీలు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద హామాలీల కొరత లేకుండా చూస్తే బాగుంటుందని, లేదంటే వర్షానికి ధాన్యం తడిసే పోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

ధాన్యం తడిసిపోకుండా తాటిపత్రిలు కప్పుతున్న రైతులు

మరుగు దొడ్లకు దేవతల పేర్లు

దేవతల పేరును తొలగించిన దృశ్యం

కామారెడ్డి, ఏప్రిల్ 12 : కామారెడ్డి ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్లకు హిందూ దేవతల పేరు పెట్టడాన్ని విశ్వ హిందూ పరిషత్ అభ్యంతరం తెలిపింది. ఆర్టీసీ డిపోలో మహాలక్ష్మి టాయిలెట్లు అని పేరు పెట్టడం ఏంటని, ఇది సమస్త హిందువులను కించపరిచినట్టేనని విశ్వ హిందూ పరిషత్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని డిపో మేనేజర్ ఇందిర దృష్టికి తీసుకెళ్లి వెంటనే తొలగించాలని డిమాండ్ చేయడంతో వెంటనే పేరును తొలగించినట్లు తెలిపారు. ఇలాంటి సంఘటనలు ఎక్కడ జరిగినా ప్రతిఘటిస్తామని విశ్వహిందూ పరిషత్ సభ్యులు హెచ్చరించారు. డిపో మేనేజర్‌ను కలిసిన వారిలో విశ్వ హిందు పరిషత్ జిల్లా కార్యదర్శి బొల్లి రాజు, జిల్లా ప్రధాన ప్రముఖ్ శ్రీకాంత్ రావు, పట్టణ అధ్యక్షుడు వడ్ల వెంటస్వామి, కార్యదర్శి వంగ ప్రసాద్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి సరుకుల అందజేత

భిక్కనూరు, ఏప్రిల్ 12 : మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ ఎల్లం ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాజ మౌళి ఆ కుటుంబ సభ్యులకు నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను శుక్రవారం అందజేశారు.

వాహనాల తనిఖీ

బీబీపేట్, ఏప్రిల్ 12: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమీపంలో ఎస్సై ప్రభాకర్ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ మల్లేశం ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలను లేని 25 మంది వాహనదారులకు జరిమానా విధించామన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అంత్యక్రియలో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, ఏప్రిల్ 12 : బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకుడు సయ్యద్ మహ్మద్ శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. పట్టణంలో సాయంత్రం నిర్వహించిన అంత్యక్రియల్లో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ డాక్టర్ అంజిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్, మహ్మద్ ఏజాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, గంగాధర్, పోతురెడ్డి, తదితరులు ఉన్నారు. బాన్సువాడలో నూతనంగా ఎన్నికైన ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

యశోద హాస్పిటల్‌లో కొత్త చికిత్స అందుబాటులోకి..

- బైపాస్ సర్జరీకి బదులుగా.. ఐవీయూఎస్ సహకారంతో ఎల్ఎంసీఏ స్టంట్ వేసిన వైద్యులు
- విలేకరుల సమావేశంలో డాక్టర్ గోపీకృష్ణ వెల్లడి

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 12 : ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండా ఐవీఎల్ కొత్త పద్ధతి ద్వారా ఐవీయూఎస్ సహకారంతో నిజామాబాద్‌కు చెందిన పేషెంట్‌కు అరుదైన చికిత్స అందించామని యశోద దవాఖాన వైద్యుడు గోపీకృష్ణ తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కమ్మర్‌పల్లి మండలం దమ్మన్నపేట్‌లోని అమీర్‌నగర్ గ్రామానికి చెందిన 49 సంవత్సరాల గుగులోత్ నందు అనే పేషెంట్‌కు 10 సంవత్సరాల క్రితం గుండెలో కవాటాలు మూసుకుపోగా.. హైదరాబాద్‌లో బైపాస్ సర్జరీ చేసి మైట్రల్‌వాల్‌ను అమర్చారని చెప్పారు. మళ్లీ ఛాతినొప్పి రావడంతో గతంలో అమర్చిన గ్రాఫ్ట్‌లు, గుండె రక్తనాళం మూసుకుపోయినట్లు గుర్తించారని తెలిపారు. చాలా మంది వైద్యులను సంప్రదించినా మళ్లీ ఓపెన్ హార్ట్ ఆపరేషన్ అవసరమని చెప్పారని, పేషెంట్ హైటెక్ సిటీలోని యశోదా దవాఖానకు వెళ్లగా.. తనను సంప్రదించారని చెప్పారు. యశోద హాస్పిటల్‌లో ఓపెన్ హార్ట్ ఆపరేషన్ అవసరం లేకుండా ఎల్ఎంసీఏ స్టంట్‌ను ఐవీఎల్, ఐవీయూఎస్ సహకారంతో అమర్చినట్లు వెల్లడించారు. సమావేశంలో సిబ్బంది రాజిరెడ్డి, మధు పాల్గొన్నారు.

వరి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

బీర్కూర్ శివారులో పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 12 : బీర్కూర్ మండల కేంద్రంలోని ఓ ఎరువుల దుకాణంలో రైతులు విత్తనాలు కొనుగోలు చేయగా పంట నష్టం వాటిల్లిందని ఇటీవల రెవెన్యూ, వ్యవసాయ అధికారులు, పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం శాస్త్రవేత్తలు పంటను పరిశీలించారు. జగిత్యాల కూనారం అగ్రోనమి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రజినీకాంత్, రుద్రూర్ కృషీ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ కిశోర్, విజయ్, మండల వ్యవసాయాధికారిణి కమల, ఏఈవో శ్రావణ్, రైతులు ఉన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యుడు

కామారెడ్డి, ఏప్రిల్ 12 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సరంపల్లిలో ఉన్న గిరిజన సంక్షేమ ప్రభుత్వ జూనియర్ కళాశాల వసతి గృహంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నేత్ర వైద్య సహాయకుడు హరి కిషన్ రావు 116 మంది విద్యార్థులకు కంటి పరీక్ష చేశారు. ముగ్గురు విద్యార్థులకు మోతి బిందు ఉన్నట్లు గుర్తించి హైదరాబాద్‌లోని సరోజినీ దేవి కంటి దవాఖానకు శస్త్ర చికిత్ర నిమిత్తం సిఫారసు చేసినట్లు తెలిపారు. నేత్రాల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్యులు క్రాంతికుమార్, నిఖత్, ప్రిన్సిపాల్ అమర్‌సింగ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ముకుంద్‌రెడ్డి కాలనీవాసులు

పిట్లం, ఏప్రిల్ 12: పిట్లంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట జాతీయ రహదారి పక్కన ముకుంద్‌రెడ్డి కాలనీవాసులు శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. తమ కాలనీవాసి ముకుంద్‌రెడ్డి జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి వాహనదారులు, ప్రయాణికుల దాహార్తిని తీరుస్తామని కాలనీవాసులు తెలిపారు. కార్యక్రమంలో బాలు, వాసు, గంగారెడ్డి, రవీందర్, సందీప్, సంతోష్, నరేశ్, ఓంకార్, శ్రీనివాస్‌రెడ్డి, పాదంరెడ్డి, గడీల పండరి, చిట్యాల శ్రీనివాస్, గోపాల్ రావు, హర్జ్యా తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా క్రీడాప్రాంగణం

బూర్గుపల్లిలోని క్రీడా ప్రాంగణం, ఇన్‌సెట్‌లో క్రీడాప్రాంగణంలో మందు బాటిళ్లు

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 12: గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడలపై మక్కువ పెంచుకునేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షలు వెచ్చించి గ్రామీణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. అప్పట్లో వాటి నిర్వహణ సక్రమంగా సాగడంతో గ్రామాల్లోని విద్యార్థులు, యువత వాటిని వినియోగించుకున్నారు. ప్రస్తుతం ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోక పోవడంతో క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. దీనిని అదునుగా చేసుకొని మందుబాబులు వాటిని తమ అడ్డాలుగా మార్చుతున్నారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని బుర్గుపల్లి గ్రామానికి కొద్ది దూరంలో రోడ్డు పక్కనే క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటుచేశారు. అక్కడ పలువురు మద్యం తాగి సీసాలను క్రీడా ప్రాంగణంలో పడేస్తున్నారు. సీసలను పగులగొట్టడంతో పెంకులన్నీ మైదానంలో ఉంటున్నాయి. దీంతో తాము క్రీడలు ఆడలేక పోతున్నామని క్రీడాకారులు నిరాశ వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి క్రీడా ప్రాంగణాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో తూకం త్వరగా వేయాలి

జాయింట్ కలెక్టర్ చంద్రమోహన్

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 12: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని త్వరగా తూకం వేయాలని జాయింట్ కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద నిర్లక్ష్యం వహించొద్దన్నారు. ఎల్లారెడ్డి, గండిమాసానిపేట్, అడ్విలింగాల గ్రామాల్లో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ప్రతి కేంద్రంలో తాగునీరు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. ట్రాన్స్‌పోర్ట్ విషయంలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే నాయబ్ తహసీల్దార్‌కు సమాచారం అందించాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎన్‌ఫోర్స్‌మెంట్ నాయబ్ తహసీల్దార్ సురేశ్, ఎల్లారెడ్డి సొసైటీ సీఈవో విశ్వనాథం తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రంలో హమాలీలు, రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చంద్రమోహన్

శుద్ధ జలాలను అందించేందుకు మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటు

గాంధారిలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి

గాంధారి, ఏప్రిల్ 12: గాంధారి ఎస్సీ కాలనీతోపాటు గుడిమెట్ గ్రామంలో పైడి ఎల్లారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్లను ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణులకు శుద్ధ జలాలను అందించాలనే ఉద్దేశంతో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. పైడి ఎల్లారెడ్డిని ఆయా గ్రామాల ప్రజలు సన్మానించారు. కార్యక్రమంలో గాంధారి జడ్పీటీసీ శంకర్‌నాయక్, ఎంపీపీ రాధాబలరాం, గాంధారి మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్, నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్, నాయకులు గోపాల్‌రెడ్డి, దొరబాబు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'మొక్కలను కాపాడే బాధ్యత జీపీ కార్యదర్శులదే'

గాంధారి, ఏప్రిల్ 12: గ్రామాల్లోని నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను కాపాడే బాధ్యత గ్రామ పంచాయతీ కార్యదర్శులదే అని ఎంపీవో సురేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి, కుప్రియాల్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన విలేజ్ నర్సరీలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అవసరం ఉన్న మొక్కలను నర్సరీల్లో పెంచాలన్నారు. మొక్కలు ఎండిపోకుండా చూసుకోవాలని, గ్రీన్ షెడ్‌ను ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ మాలధారులకు ముస్లిముల భిక్ష

మాలధారులతో భిక్షను ఏర్పాటుచేసిన వహీద్, ముఖీద్

ఎల్లారెడ్డి/ ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 12: హనుమాన్ మాలధారులకు ముస్లిములు భిక్ష ఏర్పాటుచేసి మతసామరస్యాన్ని చాటారు. ఎల్లారెడ్డి బల్దియా పరిధిలోని గండిమాసానిపేట్ గ్రామంలో హనుమాన్ దీక్ష చేపట్టిన మాలధారులకు గ్రామానికి చెందిన వహీద్, ముఖీద్ కలిసి శుక్రవారం భిక్ష పెట్టారు. వారిని గ్రామస్తులు అభినందించారు.

స.హ.చట్టంపై అవగాహన అవసరం

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 12: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని స.హ.చట్టం డైరెక్టర్ ఎంఏ సలీం అన్నారు. ఎల్లారెడ్డిలోని కస్తూర్బా గురుకుల పాఠశాలలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో విద్యార్థినులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టం ద్వారా పూర్తి వివరాలను తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపాల్ శ్వేత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 12: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సత్యనారాయణ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డి, మత్తమాల, ఆజామాబాద్, గండిమాసానిపేట్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8:30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సమావేశానికి తరలిరావాలి

రామారెడ్డి, ఏప్రిల్ 12: కామారెడ్డిలోని పార్శి రాములు కల్యాణ మండపంలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ రామారెడ్డి మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ స్పీకర్ పోచారం హాజరయ్యే ఈ సమావేశానికి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

ముత్యాల పోచమ్మకు బోనాల సమర్పణ

బోనాలను తీసుకెళ్తున్న గండివేట్ గ్రామస్తులు

గాంధారి, ఏప్రిల్ 12: మండలంలోని గండివేట్ గ్రామంలో ముత్యాల పోచమ్మకు గ్రామస్తులు శుక్రవారం బోనాలను సమర్పించారు. ప్రతి సంవత్సరం ఉగాది పండుగ అనంతరం పోచమ్మకు బోనాలను సమర్పించి మొక్కులను చెల్లించుకుంటామని గ్రామస్తులు తెలిపారు. బాజాభజంత్రీల చప్పుళ్లతో ఆలయం వరకు బోనాలను ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

FINANCIAL SERVICES

★రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార రుణం, అతి తక్కువ వడ్డీ రేటుతో, సిబిల్ అవసరం లేదు! NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏజెంట్స్ కావలెను. నొవా ఫైనాన్స్. ఫోన్: 7696660523.
NT-311979_All

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311823-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

వేలం కోసం బహిరంగ ప్రకటన
తాకట్టు బంగారు ఆభరణాల అస్తుల ఇ-వేలం కోసం బహిరంగ ప్రకటన

దిగువ ఖాతాలలో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించిందని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.
దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటి నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (బంగారు రుణ సౌకర్యం) తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు/ హామీదార్లను కోరుతూ రుణగ్రహీతలకు/హామీదార్లకు డిమాండ్ నోటీసులు జారీ చేశారు. అయితే రుణగ్రహీతలు/ హామీదార్లు బకాయి రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున తాకట్టు ఇన్‌వోక్ చేయుట బ్యాంక్‌కు తప్పనిసరి అయింది మరియు ఆస్తి షెడ్యూల్‌లో మరింతగా వివరించిన తాకట్టు బంగారు ఆభరణాలను '' ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే మరియు రికోర్స్ పద్ధతి లేని విధంగా'' తేది: 23ఏప్రిల్ 2024న మ. 12.30 గం. నుండి మ. 3.30 గం. మధ్య (ఇ-వేలం సమయం) ఇ-వేలం ఆమ్మకం నిర్వహించుటకు ప్రతిపాదించబడినది.
రుణగ్రహీతలు & బకాయి మొత్తం వివరాలు:

క్ర. సం.	బ్రాంచ్ పేరు	రుణ ఖాతా సం.	వినియోగదారు పేరు	బకాయి మొత్తం	డిమాండ్ నోటీస్ తేది	స్థూల బరువు	నికర బరువు
1	కామారెడ్డి	XXXXXXXXXXX3576	రాజ్‌పురోహిత్ రామ్‌సింగ్	90104	28-ఫిబ్రవరి-24	22.5	21.5

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా ఖాతాను తొలగించుటకు/వేలం తేదీని మార్చుటకు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్‌కు అధికారిక్ కలదు. వేలం ఆన్‌లైన్‌లో https://gold.samil.in (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)లో మ. 12.30 గం. నుండి మ.3.30 గం. మధ్య (సమయం) నిర్వహించబడును.
సవివరమైన నియమనిబంధనల కొరకు వెబ్‌సైట్ https://gold.samil.in (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)కు లాగిన్ కావలెను. అధీకృత అధికారి,యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్